క్లుప్తంగా

నేడు శాకంబరీ దేవిగా దర్శనం



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు ఆదివారం దర్శనమివ్వను న్నారు. ఆలయ ప్రాంగణంతో సహా వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పుష్పాలతో దర్శనమివ్వనున్న అమ్మవారిని, ఆలయ పరిస రాలను అలంకరించేందుకు శనివారం ఏర్పాట్లు చేశారు. శాకంబరీ అలంకరణలో ఉండే అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు ఏటా అధిక సంఖ్యలో విచ్చేసి తీర్థ ప్రసాదాలను స్వీక రిస్తారు.

నీటి ట్యాంక్‌కు రూ.2.15 లక్షలతో మెట్ల నిర్మాణం



అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామం బీసీ కాలనీలో మంచి నీటి ట్యాంక్ మెట్లు పూర్తిగా పాడైపోవడంతో కొత్త మెట్ల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పామర్తి త్రినేత్రి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ పాడైపోయిన మెట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త మెట్లు ఏర్పా టుకు పంచాయతీ నిధులు రూ.2.15 లక్షలు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. పనులను త్వరిత గతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్య దర్శి సీతారామరాజు, మాజీ సర్పంచ్ బలుసు హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సర్వీసులు



యలమర్రు(పెదపారుపూడి): రైతులకు వ్యవ సాయ మోటార్ల ద్వారా విద్యుత్ సర్వీసులు ఇచ్చినట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని యలమర్రులో వ్యవసాయ విద్యుత్ మోటారు సర్వీసులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో 2025–26 సంవత్సరం గాను మొత్తం 89 మంది రైతులు వ్యవసాయ సర్వీసులకు నగదు చెల్లించినట్లు తెలిపారు. 67 మంది రైతుల విద్యుత్ సర్వీసులు ఇచ్చామన్నారు. మిగిలిన 22 సర్వీసులను ఈ నెలాఖారులోపు రిలీజ్ చేస్తా మన్నారు. కార్యక్రమంలో రూరల్ ఏడీఈ పి.కి రణ్‌కుమార్, ఏఈ వరకుమార్ పాల్గొన్నారు.

ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో పంచుకోవాలి

మొవ్వ: విద్యార్థులు తల్లిదండ్రులతో స్నేహ పూర్వకంగా ఉంటూ ప్రతి విషయాన్ని వారితో పంచుకోవాలని కూచిపూడి ఎస్ఐ కేఎన్ విశ్వ నాథ్ సూచించారు. స్థానిక హోలీ స్పిరిట్ ఇం గ్లిష్ మీడియం హైస్కూల్లో శనివారం విద్యార్థు లకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిం చారు. అలాగే ఈవ్ టీజింగ్‌పై క్లుప్తంగా వివరిం చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గ్లారిస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వెంటనే ఏర్పాటు చేయండి

గుడివాడ టౌన్: గుడివాడలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో కోతిబొమ్మ సెంట ర్‌లోని అంబేడ్కర్ విగ్రహం తొలగించాలంటే ముందు స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రాజేంద్రన గర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా నియోజకవర్గ దళితుల ఆకాంక్ష నెహ్రూచౌక్ సెంటర్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చెయడమే అన్నారు. 2024 ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే కొడాలి నాని అంబే డ్కర్ విగ్రహం నెహ్రూచౌక్ సెంటర్‌లో ఏర్పా టుకు శంకుస్థాపన చేశారన్నారు. కాంస్య విగ్ర హాన్ని తానే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చార న్నారు. ఎన్నికల కోడ్ రావడంతో ఆ పని ఆగి పోయిందని తెలిపారు. అదే ఎన్నికల ప్రచారం లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన వెనిగండ్ల రాము అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసే బాధ్యత తాను తీ సుకుంటానని హామీ ఇచ్చార న్నారు. ఎమ్మెల్యే రాము ఇప్పటికీ దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా అంబేడ్కర విగ్రహం తొలగించాలం టే నెహ్రూచౌక్‌లో ఏర్పాటు చేశాకే తొలగిం చాలని డిమాండ్ చేశారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నాగ బాబూరావు, దళిత సంఘాల జేఏసీ నాయ కులు మెండా కిరణ్, పి. సురేష్, తోట రాజేష్ పాల్గొన్నారు.

మేడూరు రోడ్డుకు మోక్షమెప్పుడో?



గుంతలమయంగా మారిన మేడూరు రోడ్డు



ప్రమాదకరంగా ఉన్న మేడూరు వంతెన

ప్రాణ సంకటంగా మారిన ప్రయాణం

పమిడిముక్కల: వీరంకిలాకు–మేడూరు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డంతా గుంతలమయం గా మారింది. ఈ రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. అదేవిధంగా మురు గుకాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉం ది. వంతెన గోడలు పగుళ్లిచ్చి ఉన్నాయి. వంతెన వద్ద మార్జిన్‌లు కోతకు గురయ్యాయి. మేడూరు గ్రామస్తులు నిత్యం వీరంకిలాకుకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో వాహనదారులు రహదారి గుంతల్లో పడి ప్రమాదాలకు గురవు తున్నారు. రహదారికి పూర్తి స్థాయిలో మర మ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి, కొత్తది నిర్మించాలని విజ్ఞప్తి చేస్తు న్నారు.

లోక్ అదాలత్‌లో 274 కేసులు పరిష్కారం



మొవ్వలో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి



గుడివాడలో కేసు పరిష్కారపత్రాన్ని అందజేస్తున్న 11వ అదనపు జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం



కైకలూరులో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి లక్ష్మి

మొవ్వ: మొవ్వ న్యాయస్థానంలో శనివారం నిర్వహిం చిన జాతీయ లోక్ అదాలత్‌లో 274 కేసులు పరిష్కార మయ్యాయి. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మ న్, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి స్వర్ణలత వోల్గా మార్క ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేసులకు పరిష్కారం లభించినట్లు న్యాయస్థాన వర్గాలు వెల్లడించాయి. మొవ్వ న్యాయస్థాన పరిధిలోని కూచిపూడి, ఘంట సాల చల్లపల్లి మోపిదేవి పోలీస్ స్టేషన్లకు సంబంధిం చిన కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐలు కేఎన్ విశ్వనాథ్ (కూచిపూడి), ప్రతాపరెడ్డి (ఘంటసాల), వైవీఈ స త్యనారాయణ (మోపిదేవి), న్యాయవాదులు జి.శ్రీని వాసరావు, పోతుల వెంకటశివశ్రీనివాస్, యార్లగడ్డ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించినట్లు సేవాధికార కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం పే ర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ లోక్ అదాలత్ ద్వారా వేలాది కేసులు సుసు వుగా పరిష్కరించగలుగుతున్నామన్నారు. మొత్తం 3 బెంచీలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 1,013 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్య క్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవ్, జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి, పోలీస్ అధికారులు, బ్యాం కు, ఇన్సూరెన్స్ ఆఫీసర్లు, న్యాయవాదులు పాల్గొ న్నారు.

రాజీమార్గం.. రాజమార్గం

కైకలూరు: అపరిష్కృత కేసుల పరిష్కారంలో రాజీమా ర్గమే రాజమార్గమని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు వీవీఎస్‌వీ.లక్ష్మి, ఎం.శివకిరణ్ పేర్కొన్నారు. కై కలూరు కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యం లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారులతో జడ్జిలు మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. సీని యర్, జూనియర్ కోర్టులో కలిపి మొత్తం 881 వివిధ రకాల కేసులను పరిష్కరించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు టి.శ్రీనివాసరా వు, శరత్‌బాబు, ఇందిరా, సత్యనారాయణ, పాము లు, పవన్‌కాంత్, శివప్రసాద్, జితేంద్ర పాల్గొన్నారు.

వల్లభనేని వంశీకి మాజీ మంత్రులు కొడాలి, పేర్ని పరామర్శ



వల్లభనేని వంశీని పరామర్శిస్తున్న మాజీ మంత్రులు కొడాలి, పేర్ని

హనుమాన్‌జంక్షన్ రూరల్: అక్రమ కేసుల్లో అరెస్ట్ అయి 140 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న వైఎ స్సార్ సీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని శనివారం పరామర్శించారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో ప్రస్తుతం నివాసం ఉంటున్న వంశీ వద్దకు ఇరువురు నేతలు వచ్చారు. జైలులో పలుమార్లు అనారోగ్యానికి గురికావడంతో వంశీ యోగక్షేమాలను వారు అడిగి తెలుసుకున్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



యాకమూరులో ఆషాఢ సారెతో వెళుతున్న మహిళలు



కొండలమ్మకు సారెను సమర్పించిన మహిళా భక్తులు



కైకలూరులో పార్వతీమాతకు సారె సమర్పిస్తున్న భక్తులు

తోట్లవల్లూరు: యాకమూరు సమీపంలోని ఏజీకే నగర్ వద్ద కొలువైన దుర్గమ్మ తల్లికి భక్తులు భక్తిశ్రద్ధ లతో ఆషాఢ సారెను శనివారం సమర్పించారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని గ్రామానికి చెం దిన మహిళలు చీర, సారె, పసుపు, కుంకుమలు, పూలు, పండ్లతో సారె సమర్పించేందుకు ఉత్సా హంగా తరలివెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొండలమ్మకు..

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి చల్లపల్లి మండలం భోగిరెడ్డిపల్లికి చెందిన దావు శారద ఆధ్వర్యంలో మహిళా భక్తులు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శనివారం సారెను సమర్పించారు. అనంతరం ఆ భక్తుల పేరిట వేద పండితులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అధికసం ఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కైకలూరులో..

కైకలూరు: ఆషాఢ మాసం సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారి క్షేత్రంలో రామలింగేశ్వ రస్వామి శివాలయంలోని పార్వతీమాతకు గ్రామా నికి చెందిన ఉప్పులూరు రాజశేఖర్, ముత్తంరాజు శర్మ దంపతులు శనివారం ఆషాఢ సారె సమర్పిం చారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఆలయ మర్యాద లతో దంపతులను ఆహ్వానించారు. ఈ సందర్భం గా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: ఆటోనగర్‌లో పనిచేస్తున్న 22వ వార్డు కార్మికనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ సమత్‌కు ది గుడి వాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ. 10 వేలు సాయం అం దజేశారు. శనివారం ఆయన నివాసంలో సంఘం నాయకుల ఆధ్వర్యంలో నగదు అందజేశారు. ఈ సం దర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అబ్దుల్ సమత్ ఆటోనగర్‌లో పనిచేస్తుండగా ప్రమా దవశాత్తు రేకుపడి నాలుగు వేళ్లు తెగిన కారణంగా విధి నిర్వహణకు హాజరు కాలేకపోతున్నారన్నారు. ఆపదలో ఉన్న కార్మికుడికి యూనియన్ ఆధ్వర్యంలో వితరణ అందజేశామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్య క్షుడు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి కుద్దూస్, టి. లక్ష్మణరావు, బి.ఆంజనేయులు, మొహిద్దీన్‌బాషా, రషీద్ బేగ్, కె. నాగరాజు, ఎం.ఆదినారాయణ, ఆర్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలకు ఉచితంగా టీకాలు

మండవల్లి: పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని పశువైద్యశాల సహాయ సంచాల కులు డాక్టర్ డీవీ వరప్రసాద్ తెలిపారు. జూలై 6న ప్రపంచ జ్యూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రతి పశువుల ఆస్పత్రిలో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకు గాను ప్రభుత్వం మం డవల్లి మండలానికి 800 డోసులు, ముదినేపల్లి మండ లానికి 400 డోసులు టీకా మందును సరఫరా చేసిం దని తెలిపారు. కుక్కల పెంపకందార్లు తమ కుక్క లను విధిగా పశువైద్యశాలకు తీసుకొచ్చి యాంటీ రేబీస్ టీకా వేయించాలని కోరారు.

పామర్రులో..

పామర్రు: జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పశువైద్యశాల్లో ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాల పంపిణీ చేయనున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీఏ వెంకట్రావ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని రకాల కుక్కలకు ఈ టీకాలను వేయనున్నట్లు పేర్కొన్నారు.

10న గురుపౌర్ణమి మహోత్సవం

కైకలూరు: ఈ నెల 10న సీఎన్నార్ గార్డెన్‌లో నిర్వహిం చనున్న గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కైకలూరు ఎన్జీవోస్ కాలనీలోని ఓం నమోస్తుతే క్షేత్రం నిర్వాహకురాలు డాక్టర్ ప్రశాం తి శనివారం కోరారు. ఈ కార్యక్రమాలకు ప్రముఖ గురువు జై మహావిభోశ్రీ విచ్చేస్తున్నారని పేర్కొ న్నారు. ఆరోజు ఉదయం 8.10 నుంచి 11.12 గంటల వరకు మహాలక్ష్మీ, మహాగురు, శ్రీచక్ర యజ్ఞం నిర్వ హించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభూజీ దివ్య సత్సంగం ఉంటుందని పేర్కొన్నారు.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: కొన్నిరోజులుగా తండ్రి కనిపిం చడం లేదంటూ కుమారుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని వడాలికి చెందిన మారగాని సరస్వతీ రావు భార్య చనిపోయినప్పటి నుంచి కుమారుడు నరేష్‌బాబు ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో గత నెల 17న ఉదయం నుంచి సరస్వతీరావు కనిపించ కుండా పోయినట్లు నరేష్ ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వీర భద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నా క్యాంటిన్ నిర్మాణానికి భూమి పూజ



పామర్రు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో అన్నా క్యాంటిన్ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంటిన్ నిర్మాణం పనులను 120 రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తహ సీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, బస్టాండ్‌కు దగ్గరగా కాంటిన్ ఏర్పాటు చేయ డంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే పొరుగు గ్రామాల ప్రజలకు క్యాంటిన్‌లో రూ.5లకే ఇచ్చే భోజనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జన సేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు వల్లూరిపల్లి గణేష్, పార్టీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన

పామర్రు: ఎన్నికల నియమ నిబంధనలపై బీఎల్వోలకు పూర్తి అవగాహన కల్గి ఉం డాలనే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పామర్రు, పెదపారుపూడి తహసీల్దా ర్‌లు జీ రవికాంత్, శ్రీనివాస్‌నాయిక్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో ఎన్నికల విధి విధానాలపై పామర్రు, పెదపారుపూడి మండలాల బీఎల్ ఓలకు మూడో రోజు శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీల కమైందన్నారు. నియోజకవర్గంలోని బీఎల్‌ఓలందరూ ఈ నెల 9 నుంచి ఓటర్ జాబితా తయారీ, మార్పులు, చేర్పులు అదేవిధంగా మరణించిన వారు, వలస వెళ్లిన వారి వివరాలను పరిశీలించి, తుది సమాచారం అందించే విధంగా తరగ తులను చేపట్టామన్నారు. 80 ఏళ్ల దాటిన ఓటర్ల వివరాలను తప్పకుండా సేకరిం చాలన్నారు. మాస్టర్ ట్రైనర్ యార్లగడ్డ మృదుల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో పామర్రు ఆర్ఐ రాము పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులపై మహిళ ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: ఒంటరిగా నివసిస్తున్న మహిళను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు అందింది. పోలీ సుల కథనం మేరకు మండలంలోని వణుదుర్రు గ్రామానికి చెందిన ఓ వివాహిత భర్తతో మనస్పర్థల కారణంగా ఒంటరిగా నివసిస్తూ ముదినేపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తోంది. ముదినేపల్లికి చెందిన జి.రవిశంకర్ కొంతకాలంగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నట్లు పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వీరభద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెండి నక్షత్ర హారతి బహూకరణ



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డ రోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వా మికి భక్తులు వెండి నక్షత్ర హారతిని శనివారం బహూకరించారని ఆలయ ఈఓ పీవీఎస్‌వీ ప్రసాదరావు పేర్కొ న్నారు. విజయవాడకు చెందిన ఉప్ప లపాటి ఉమాదేవి స్వామికి 865గ్రాముల బరువు కలిగి సుమారు రూ.1.01 లక్ష విలువ గల వెండి నక్షత్ర హారతిని సమర్పించారని తెలిపారు. దాతను సత్కరించా మన్నారు. మట్టా వెంకటేశ్వరరావు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడివాడకు విచ్చేసిన కొడాలి నాని



పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న కొడాలి నాని

గుడివాడ టౌన్: గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) శనివారం పట్టణానికి విచ్చేశారు. ఒక కేసులో షరతులతో కూడిన బెయి ల్‌పై ఉన్న కొడాలి నాని ప్రతి మంగళవారం, శని వారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంతకం చెయ్యాల్సి ఉంది. దీంతో ఆయన పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి కార్యకర్తలతో కలిసి ఆయన నివాసానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన కార్యకర్తలను పలకరించి కొద్ది సమయం విశ్రాంతి అనంతరం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కలిసేందుకు తేలప్రోలు వెళ్లారు.

రెండో రోజూ ఆర్టీసీ కార్మికుల నిరసన



ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

గుడివాడ టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు రెండో రోజు శనివారం కూడా ధర్నా చేశారు. స్థానిక డిపో గేటువద్ద భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. ఈ సంద ర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రమో షన్లు ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న 10 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఎలక్ట్రికల్ బస్ లను ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేసే వాటిని ఆర్టీసీ సిబ్బందే నడపాలన్నారు. వాటిని ప్రైవేట్ యాజమాన్యాలకు అప్పగించవద్దని కోరారు. డీఏ బకాయిలు చెల్లించాలని, 11వ పీఆర్సీ 24 నెలల బకాయిలు చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్ష,కార్యదర్శులు ఎంవీ రమణ, కేఎస్ రావు, నాయకులు సుబ్రహ్మ ణ్యం, కె.వాణి, పి. కొండలరావు, ఎస్‌వీ సాయికు మార్, ఎస్‌కే ఆజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ముదినేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతి రేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. ఈ సం దర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెంచిన 10 గం టల పనిదినం పెంపును రద్దు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.లెనిన్, ఎస్.మహంకాళిరావు, ఎస్.అరుణకుమా రి, బండి పద్మ, కె.విజయలక్ష్మి, పి.సరస్వతీ, ఎస్.వి జయలక్ష్మి పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



కానూరులో సాగుతున్న జగన్నాథ రథయాత్ర

పెనమలూరు: ఇస్కాన్ జగన్నాథ్ మందిర్ ఆధ్వ ర్యంలో కానూరు గ్రామంలో శనివారం జగన్నాథ రథయాత్ర కనుల పండువగా సాగింది. భక్తులు తన్మయత్వంతో రథయాత్రలో పాల్గొని భక్తిపార వశ్యం చెందారు. మందిర అధ్యక్షుడు చక్రదారి దాస్ ప్రోత్సాహంతో జగన్నాథ, బలదేవ, సుభద్ర మహారాణిల విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించి రథంలో ఉంచి గ్రామ వీధుల్లో రథ యాత్ర జరిపించారు. కానూరు శ్రీ సాయి గీతా మందిరం నుంచి ప్రారంభమైన యాత్రను సిద్ధార్థ కళాశాల వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వెంకట రత్నప్రసాద్ పాల్గొన్నారు. చక్రధారి దాస్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లా డుతూ విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టిన జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగు తోందన్నారు. ఈ సందర్భంగా గౌరాంగి, హర్షిణి, సహర్ష సంప్రదాయ భరత నాట్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. రథ యాత్ర కానూరు పంట కాలువ రోడ్డు, నాగార్జున హాస్పిటల్స్ మీదుగా సాగింది. వేలాదిమంది భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమం లో బలరాం గోవింద దాస్, వ్రజథామ్ దాస్, శ్రీకాంత్ నరసింహ దాస్, శ్యాంసుందర్ అచ్యుత దాస్, భక్తులు పాల్గొన్నారు.